సాక్షి ప్రకాశం

మంగళవారం : 28 : మే : 2024



అభివృద్ధిలో రైట్..రైట్

వైఎస్సార్ సీపీ హయాంలో ఆర్టీసీ బస్టాండ్‌లు కొత్తరూపు దిద్దుకున్నాయి. యర్రగొండ పాలెం నియోజకవర్గంలో బస్టాండ్‌లను అభివృద్ధి చేశారు.

- 8లో..



కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జేసీ గోపాలకృష్ణ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
39/30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

ఉద్యాన సాగు..బాగు

ఉద్యాన పంటల ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ప్రధానంగా మార్కెట్లో వివిధ రకాల పండ్లకు గిరాకీ ఉండడంతో ఈ పంటల సాగుకు ప్రభుత్వం పెట్టపీట వేస్తోంది. కూరగాయలు, పండ్లు, ఇతర ఉద్యాన పంటలకు భారీగా రాయితీలు ఇస్తూ సాగును ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వారా సహకారాన్ని అందిస్తోంది. కొన్ని పంటలకు మూడేళ్ల వరకూ నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం భరిస్తోంది. దీంతో రైతులు ఉద్యాన పంటల సాగుపై ఉత్సాహంచూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పది వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి.

- జిల్లాలో 10 వేల హెక్టార్లలో వివిధ రకాల పండ్లసాగు
- ఏడు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్న లక్ష్యం
- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం చేయూత
- ఉపాధి హామీ పథకంలో సహకారం

మార్కాపురం: తక్కువ పెట్టుబడి..లాభాలు మెండుగా ఉండడంతో రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం సైతం వీరికి పలు రాయితీలు ఇస్తూ చేయూతనందిస్తోంది. జిల్లాలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో వివిధ రకాల పండ్ల తోటలు సాగవుతున్నాయి. తూర్పున మామిడి, సపోట, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలు సాగవుతుండగా, పశ్చిమాన బొప్పాయి, అరటి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ పండ్ల తోటలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల హెక్టార్లలో ఇవి సాగవుతున్నాయి. 12 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు పశ్చిమ ప్రకాశం బత్తాయి సాగులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేది. మార్కాపురం, గిద్దలూరు, కంభం, కనిగిరి, దర్శి, కొండపి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగవుతోంది. ప్రస్తుతం మూడు వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. నీటి వసతి లేకపోవడంతో రైతులు బత్తాయి పంటలు వదిలి దానిమ్మ, బొప్పాయి, అరటి పంటలను బోర్ల కింద సాగు చేస్తున్నారు. దర్శి, కొత్తపట్నంలో ఉన్న ప్రభుత్వ నర్సరీల్లో కొబ్బరి, మామిడి, నిమ్మ మొక్కలు రైతులకు సరఫరా చేస్తున్నారు.

జిల్లాలో సాగు ఇలా...

జిల్లాలో మొత్తం 5 క్లస్టర్స్ ఉన్నాయి. బేస్తవారిపేట, దర్శి, కనిగిరి, మార్కాపురం, ఒంగోలు క్లస్టర్స్ పరిధిలో 38 మండలాల్లో హార్టీకల్చర్ విభాగం రైతులకు సేవలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

◈ బేస్తవారిపేట పరిధిలోని అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల తర్లుపాడు మండలాల్లో మొత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో 1550 ఎకరాల్లో పండ్ల మొక్కల ప్లాంటేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 60 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తయింది.

దర్శి క్లస్టర్ పరిధిలో...

దర్శి, కొనకనమిట్ల, కురిచేడు, మర్రిపూడి, ముండ్లమూరు, పొదిలి, తాళ్లూరు మండలాలు ఉన్నాయి. మొత్తం 1200 ఎకరాల్లో ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 27.95 ఎకరాల్లో చేశారు.

కనిగిరి క్లస్టర్‌లో...

సీఎస్‌పురం, హనుమంతునిపాడు, కనిగిరి, పామూరు, పీసీపల్లి, పొన్నలూరు, వెలిగండ్ల మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1540 ఎకరాల్లో పండ్లతోటల ప్లాంటేషన్ లక్ష్యాన్ని నిర్ణయించారు.

మార్కాపురం క్లస్టర్ పరిధిలో...

దొనకొండ, దోర్నాల, మార్కాపురం, పెద్దారవీడు, పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాలు ఉన్నాయి. మొత్తం 1650 ఎకరాల్లో పండ్ల మొక్కల ప్లాంటేషన్‌కు గానూ 40 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయింది.

ఒంగోలు క్లస్టర్ పరిధిలో...

చీమకుర్తి, కొండపి, కొత్తపట్నం, మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు, సంతనూతలపాడు, సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి మండలాలు ఉన్నాయి. ఇందులో 1060 ఎకరాలకు గానూ 12 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయింది.

ప్రభుత్వ ప్రోత్సాహం ఇలా..

పండ్ల తోటల్లో ప్రముఖంగా తైవాన్ జామ, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, చీనీ, నిమ్మ, మామిడి, జీడిమామిడి తదితర పండ్ల తోటలు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఇందులో కొన్ని పంటలకు మూడేళ్ల వరకూ నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం అందిస్తోంది. ఎకరాకు మూడేళ్లకు సగటున లక్ష రూపాయల వరకూ ప్రభుత్వం ప్రోత్సాహంగా ఇస్తుంది. అలాగే షేడ్ నెట్లు, భారీ ఇంకుడు గుంతలు, ప్యాక్ హౌస్‌లు, శీతల వాహనాలు, యంత్రాల కొనుగోలు వంటి వాటికి ఉద్యానశాఖ రాయితీలు ఇస్తోంది.

ఉపాధి హామీ పథకం వర్తింపు:

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ప్రధానంగా ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ సహాయం ఉండాలంటే రైతుకు కచ్చితంగా జాబ్‌కార్డు ఉండాలి. పొలం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలు అందించాలి. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉపాధి హామీ అధికారులు పరిశీలించి సబ్సిడీ అందిస్తారు. పండ్ల తోటల్లో రైతులు చేసుకునే పనులకు ఈ పథకం ద్వారా బిల్లుల రూపంలో నగదు చెల్లిస్తారు.



మద్దిపాడులో పండ్ల తోటలను పరిశీలిస్తున్న డ్వామా, హార్టీకల్చర్ అధికారులు



దర్శిలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న పీడీ అర్జునరావు, అధికారులు

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



ఉద్యాన పంటలు సాగుచేసే రైతులు ఉపాధిహామీ పథకం ద్వారా అందుతున్న ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకోవాలి. జిల్లాలో ఉద్యానపంటల సాగు కూడా పెరుగుతోంది. ప్లాంటేషన్స్ చేయిస్తున్నాం. ప్రభుత్వ నర్సరీల్లో కూడా మొక్కలు పెంచుతున్నాం. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బి.అర్జునరావు, పీడీ, డ్వామా

ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు



జిల్లాలోని ప్రభుత్వ నర్సరీల్లో పలు రకాల పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు వీటిని అందిస్తాం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేల హెక్టార్లలో పండ్ల తోటలు సాగవుతున్నాయి. రైతులు తాము సాగుచేసే పంటలకు రక్షణగా కరోండా (వాక్కాయ) సాగు చేసుకుంటే ఆదాయం కూడా వస్తుంది. దీని నుంచే చెర్రిపండ్లు కూడా వస్తాయి. వీటిని బేకరీల్లో ఉపయోగిస్తారు. జిల్లా వ్యాప్తంగా మామిడి, సపోట, అరటి, దానిమ్మ, బొప్పాయి, బత్తాయి తదితర పంటలు సాగవుతున్నాయి.

– గోపీనాథ్, హార్టీకల్చర్ ఏడీ, ఒంగోలు

న్యూస్‌రీల్

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత పత్రాలను ప్రింట్ తీసుకోవాలన్నారు. జిల్లాలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఐటీఐ కాలేజీలను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఒక సెట్ 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లను వచ్చే నెల 10వ తేదీలోపు ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరిగిన విద్యార్థులకు మాత్రమే కౌన్సిలింగ్ తేదీలను తెలియజేస్తారన్నారు. పూర్తి వివరాలకు ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఉన్న కన్వీనర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 83330 30281 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలి

ఒంగోలు టౌన్: పెన్షనర్లు తమ సమస్యల పరిష్కారంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, తద్వారా సులువుగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని భవిష్యనిధి జిల్లా నోడల్ అధికారి యం.సమ్మయ్య చెప్పారు. పీఎఫ్ వలన ఒకగూరే ప్రయోజనాలను అసిస్టెంట్ కమిషనర్ సతాష్ కుమార్ వివరించారు. సోమవారం నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమాన్ని కిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యల గురించిన సమగ్ర వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఉద్యోగులకు చాలా మేలు కలుగజేస్తాయని కిమ్స్ సీఈఓ అంకిరెడ్డి అన్నారు. ఒంగోలు జిల్లా కార్యాలయం చేస్తున్న వివిధ సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పీఎఫ్ జిల్లా కార్యాలయ సిబ్బంది డీసీ రామారావు, శంకర్, కిమ్స్ హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీహరి రెడ్డి, హెచ్‌ఆర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.323



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.323 పలకగా, కనిష్ట ధర రూ. 205, సరాసరి రూ.260.66 ధర పలికింది. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాధువారిపాలెం గ్రామాలకి చెందిన రైతులు వేలానికి 1022 బేళ్లను తీసుకురాగా వాటిలో 909 కొనుగోలు చేసి, 113 బేళ్లను తిరస్కరించారు. ఈ వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. రైతులు పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా వేలం కేంద్రానికి తీసుకొని రావాలన్నారు.

టంగుటూరి గోపాలకృష్ణకు అశ్రునివాళి



టంగుటూరు ప్రకాశం పంతులు కుటుంబ సభ్యుల చిత్రాలతో గోపాలకృష్ణ (ఫైల్)



2022వ సంవత్సరంలో ప్రకాశం పంతులు వర్థంతి సందర్భంగా నివాళులర్పిస్తూ.. (ఫైల్)



గోపాలకృష్ణను సన్మానిస్తున్న అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపె విశ్వరూప్ (ఫైల్)

ఒంగోలు మెట్రో: స్వాతంత్య్ర సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మనుమడు టంగుటూరి గోపాలకృష్ణ (64) ఆకస్మిక మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు రెండో కుమారుడైన హనుమంతరావు, అన్నపూర్ణాదేవి దంపతుల కుమారుడైన టంగుటూరి గోపాలకృష్ణ ఒంగోలులోనే జన్మించారు. కమర్షియల్ టాక్స్ విభాగంలో రికార్డు అసిస్టెంట్‌గా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఆయన ప్రకాశం జిల్లా స్వాతంత్య్ర సమరయోధుల వారసుల సంఘం పక్షాన జరిగే కార్యక్రమాలతో పాటు ప్రకాశం పంతులు జయంతి, వర్ధంతి, జిల్లా అవతరణ దినోత్సవం, స్వాతంత్య్ర దినం, గణతంత్రదిన వేడుకల్లో పాల్గొనేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టంగుటూరి గోపాలకృష్ణను గతంలో ఘనంగా సన్మానించారు. గోపాలకృష్ణ మరణం పట్ల ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గ సభ్యులు, ఎర్రన్న సాహితీ పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎంవీఎస్ శాస్త్రి, ప్రముఖ సాహిత్యవేత్త నేమ్మాని సీతారామమూర్తి, బ్రాహ్మణ సంక్షేమ ట్రస్ట్ సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

గోపాలకృష్ణ మృతి బాధాకరం : చెవిరెడ్డి భాస్కరరెడ్డి

స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు మనుమడు గోపాలకృష్ణ మృతి బాధాకరమని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాడు స్వాతంత్ర్యం కోసం వారి కుటుంబ సభ్యులు అందించిన సేవలు మరువలేనవని చెవిరెడ్డి అన్నారు.

టంగుటూరి కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మనుమడు టంగుటూరి గోపాలకృష్ణ మృతి బాధాకరం అని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ దేశానికి వారి కుటుంబం అందించిన సేవలు నిరుపమానం అని కొనియాడారు. అటువంటి కుటుంబాన్ని యావత్ జాతి మరచిపోకూడదని అన్నారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని పేర్కొన్నారు.

టంగుటూరి గోపాలకృష్ణ మృతికి మంత్రి సురేష్ సంతాపం

సింగరాయకొండ: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మనుమడు టంగుటూరి గోపాలకృష్ణ మృతికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మృతి బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రాలతో విద్యార్థులు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో మూడో సంవత్సరం డిప్లమా కోర్సు చదువుతున్న విద్యార్థినులను వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పారిశ్రామికవేత్త కుంభ శ్రీనివాసులు, ఈతముక్కల ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారిని శివపార్వతి హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఏసు ప్రసాద్‌రావు అధ్యక్షత వహించారు. సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఈతముక్కల పాలిటెక్నిక్ కాలేజీకి మంచి గుర్తింపు ఉందన్నారు. కాలేజీలో చదువుతున్న ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారన్నారు. శివపార్వతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈతముక్కల కాలేజీ నుంచి ఎక్కువ మందికి అనేక సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం వల్ల జీవితంలో స్థిరపడుతున్నారని వివరించారు. విద్యార్థులు కష్టపడి బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణులై జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ నుంచి 22 మంది విద్యార్థులు, కంప్యూటర్ ఇంజినీరింగ్ నుంచి 22 మంది, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ నుంచి ఐదుగురు విద్యార్థులు వివిధ ప్రైవేటు సంస్థల నుంచి నియామక పత్రాలు అందుకున్నారు.

కార్యక్రమంలో నియామక అధికారి కట్ట ఎలీషా, దివ్యారెడ్డి పద్మావతి ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ శాఖాధిపతి పీ రజిని, కంప్యూటర్ ఇంజినీరింగ్ శాఖ అధిపతి విజయవర్ధన్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ శాఖ అధిపతి బీ విజయ్ కుమార్, సీనియర్ లెక్చరర్ లక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకులు కాజా తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

- భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో సోమవారం ఢిల్లీ నుంచి అన్నీ జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసిన రాష్ట్రాలు జరగబోయే కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు.

కౌంటింగ్‌పై పూర్తి అవగాహన అవసరం



ఓట్ల లెక్కింపుపై శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. స్పందన భవనంలో ఏఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్‌లు, అసిస్టెంట్‌లకు సోమవారం రెండు విడతలుగా శిక్షణ నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ఆ విషయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఏ విధంగా ఓపెన్‌చేయాలి, ఓటుకు టిక్ పెట్టడంలో అస్పష్టతను ఏ విధంగా నిర్ధారించి వాటిని చెల్లని ఓట్లుగా పరిగణించాలో, ఓటరు పరోక్షంగా తన గుర్తింపును ఏ విధంగా వెల్లడించే అవకాశం ఉందో ఆయా విషయాలను ఏజెంట్ల దృష్టికి ఏ విధంగా తీసుకువెళ్లాలో కలెక్టర్ వివరించారు. ఓటింగ్ ప్రక్రియను విజయవంతంగా అధికార యంత్రాంగం పూర్తి చేసిందని, కౌంటింగ్ కార్యక్రమాన్ని కూడా అదేవిధంగా నిర్వహించి ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ హాళ్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



తేటుపురం వద్ద గుర్తుతెలియని మృతదేహం

టంగుటూరు: మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని తేటుపురం పాలేరు నది ఒడ్డుకు గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. గుర్తుతెలియని (40) సంవత్సరాలు కలిగిన వ్యక్తి బులుగు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు తేటుపురం పాలేరు ఒడ్డున తేలాడం చూసి గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. వివరాలకు 9121102137 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై పున్నారావు తెలిపారు.

విద్యుదాఘాతానికి నాలుగు గేదెలు మృతి

- రూ.5.30 లక్షల నష్టం



పొలంలో విద్యుత్ షాక్‌కి గురై మృతిచెందిన గేదెలు

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ గ్రామ పొలాల్లో సోమవారం విద్యుదాఘాతానికి నాలుగు గేదెలు మృతి చెందాయి. వీటి విలువ రూ.5.30 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. పశువులను తోలుకొని పొలం వెళ్లగా ఈదరుగాలులకు పొలంలో విద్యుత్ తీగలు తెగి కింద పడడంతో గేదెలు విద్యుత్ షాక్‌కి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు గోదాల సుబ్బారెడ్డి, కర్నాటి పెద వెంకటరెడ్డి, గండె బెంజయ్య, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి కోరారు.



నాడు అస్తవ్యస్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్



నేడు ప్రయాణికుల వసతులతో వెలుగొందుతున్న ఆర్టీసీ బస్టాండ్

అభివృద్ధిలో రైట్..రైట్..

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బాగుపడిన బస్టాండ్‌లు
- ప్రయాణికుల సౌలభ్యమే లక్ష్యంగా ఆర్టీసీ బస్టాండ్ల ఏర్పాటు
- రూ.వందల కోట్ల విలువైన స్థలంలో బస్టాండ్ నిర్మాణాలు
- అస్తవ్యస్తంగా ఉన్న మరో మూడు బస్టాండ్‌ల అభివృద్ధి
- స్వలాభాపేక్ష ఉండదని పట్టించుకోని ఆనాటి టీడీపీ నాయకులు

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ బస్టాండ్‌లు కొత్తరూపు దిద్దుకున్నాయి. పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాలలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్‌లకు వెళ్లి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేందుకు సుముఖత చూపేవారు కాదు. రోడ్ల వెంట నిలబడి బస్సుల కోసం వేచి చూసేవారు. 2019కు ముందు ఎండలకు, వర్షాలకు అనేక ఇబ్బందులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా మండలాల్లోని ఆర్టీసీ బస్టాండ్‌లపై దృష్టి సారించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. ఊరికి దూరంగా అస్తవ్యస్తంగా ఉన్న యర్రగొండపాలెం ఆర్టీసీ బస్టాండ్‌ను గ్రామ నడిబొడ్డుకు తరలించారు. కబ్జాకు గురైన దాదాపు రూ.100 కోట్లకు పైబడి విలువ చేసే స్థలంలో బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్, మరుగు దొడ్లు ఏర్పాటు చేశారు. శ్రీశైలం ముఖద్వారం అయిన పెద్దదోర్నాలలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు, శ్రీశైలంకు వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. అటువంటి పరిస్థితులను గమనించిన వైఎస్సార్ సీపీ నాయకులు అందరికీ అందుబాటులో ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి అక్కడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి పునాదులు వేశారు. అప్పట్లోనే కొంతమంది టీడీపీ నాయకులు అక్కడ బస్టాండ్ నిర్మాణాన్ని అభ్యంతరం పెట్టడంతో పాటు కోర్టుకు వెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇబ్బందులను అధిగమించి దాదాపు రూ.100కోట్లు విలువైన స్థలంలో బస్టాండ్ ఏర్పాటు చేసి ప్రయాణికులకు వసతులను సమకూర్చారు. పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడులలో ఉన్న బస్ షెల్టర్ల ప్రాంగణాలను మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లోని ప్రయాణికులు స్వేచ్ఛగా బస్టాండ్‌లకు వెళ్లి తమ గమ్య స్థానాలకు వెళ్లగలుగుతున్నారు.

35 ఏళ్లుగా సుదూర ప్రాంతంలోనే..

పుల్లలచెరువు రోడ్డులో 1986లో బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. పట్టణానికి సుదూర ప్రాంతంలో ఈ బస్టాండ్ ఉండటమే కాకుండా ప్రయాణికులకు రక్షణ లేకుండా పోయేది. బస్సులు అక్కడికి వెళ్లేవి కావు. కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఆ బస్టాండ్‌కు వెళ్లేందుకు సుముఖత చూపేవారు కాదు. ఊరికి దూరంగా ఉండటంతో పాటు ప్రయాణికులు అక్కడికి వెళ్లేందుకు ఆటోల సదుపాయం కూడా లేకపోవడంతో రోడ్ల వెంట బస్సుల కోసం ఎదురుచూసేవారు. ఆర్టీసీ బస్సులు సైతం వ్యాపార కూడళ్లలో ఆపి ప్రయాణికులను ఎక్కించుకునేవారు. దీంతో ఎండలకు, వర్షాలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. టీడీపీ ప్రభుత్వ కాలంలో నాయకులు తమకు స్వలాభ పేక్ష ఉండదన్న ఉద్దేశంతో ఈ బస్టాండ్ గురించి పట్టించుకోలేదు. నియోజకవర్గంలోని అన్ని బస్టాండ్‌ల పరిస్థితి ఇదే విధంగా కొనసాగేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రయాణికుల ఇక్కట్లను దృష్టిలో ఉంచుకొని నడిబొడ్డున బస్టాండ్లు ఏర్పాటు చేసి ఇక్కట్లు తీర్చారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ

చీమకుర్తి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. చీమకుర్తిలోని ఆర్‌ఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపును మొత్తం 18 లేదా 19 రౌండ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జూన్ నెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 5 గంటలకే లెక్కింపు సిబ్బందితో పాటు పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాల్సి ఉందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం మూడు కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి హాలులో పార్లమెంట్ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు చేస్తారని, ఇందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెండో హాలులో అసెంబ్లీ ఓట్లను 14 టేబుళ్లలో ఏర్పాటు చేసి లెక్కిస్తామన్నారు. మూడో హాలులో అసెంబ్లీకి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లను, సర్వీస్ ఓటర్లను 4–5 టేబుల్స్‌లో లెక్కిస్తామన్నారు. పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లను జూన్ నెల 3న పటిష్ట భద్రతా చర్యలు మధ్య బాపట్లకు పంపిస్తామన్నారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని 256 పోలింగ్‌స్టేషన్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే ఏజెంట్ల వివరాలను జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఇవ్వాలన్నారు. కానీ ఇంత వరకు ఎవ్వరూ ఇవ్వలేదని తెలిపారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ట్రయల్ రన్ కార్యక్రమాన్ని జూన్ నెల 1న చేపట్టనున్నట్లు ఆర్‌ఓ తెలిపారు. లెక్కింపు కేంద్రంలో పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్లు ప్రవర్తించాల్సిన విధి విధానాలపై ఇప్పటికే స్పష్టంగా వివరించినట్లు పేర్కొన్నారు. లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు నూటికి 99.9 శాతం ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించేందుకు ప్రత్యేక పరిశీలకులు కూడా హాజరవతారన్నారు.

తిరునాళ్ల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన చెవిరెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కనిగిరి రూరల్: పామూరు మండలం మోపాడు రిజర్వాయ వద్ద ఉన్న గంగా భవాని దేవస్థానం తిరునాళ్ల మహోత్సవం జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు జరగనుంది. తిరునాళ్ల మహోత్సవానికి హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆహ్వానించారు. అనంతరం తిరునాళ్ల మహోత్సవ వాల్‌పోస్టర్‌ను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు.

ఒంగోలు అసెంబ్లీకి 143 సర్వీసు ఓట్లు



సర్వీసు ఓట్లను భద్రపరుస్తున్న అధికారులు

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం నాటికి 143 సర్వీసు ఓట్లు ఆర్‌ఓ కార్యాలయానికి చేరాయి. సోమవారం రిజిష్టర్ పోస్టు ద్వారా 6 ఓట్లు వచ్చాయి. వాటిని పోలీసు బందోబస్తు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లో వేసి సీలు వేశారు. సర్వీసు ఓట్లను జూన్ 4వ తేదీ ఉదయం 8గంటల వరకు తీసుకుని భద్రపరుస్తామని ఒంగోలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ పసుపులేటి హేమంత్, ఏఓ చిన్నికృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, అనిల్, సత్యం, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో ఆచూకీ దొరకని మృతదేహం





రామతీర్థం రిజర్వాయర్‌లో మృతదేహం కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్ళు, పోలీసులు

చీమకుర్తి: ఈత కొట్టేందుకు రామతీర్థం రిజర్వాయర్‌లో దిగి మునిగిన యాతం మణికంఠ రెడ్డి మృతదేహం ఆచూకీ ఇంకా దొరకలేదు. సోమవారం చీమకుర్తి సీఐ దుర్గా ప్రసాద్ నేతృత్వంలో ఫైర్ సిబ్బంది, కొత్తపట్నం నుంచి పిలిపించిన ప్రత్యేక గజ ఈతగాళ్ల సాయంతో రామతీర్థం రిజర్వాయర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించారు. రిజర్వాయర్‌లో నీళ్లు ఎక్కువగా ఉండటంతో మృతదేహం కోసం గాలించడం కష్టంగా ఉందన్నారు. తాళ్లూరు మండలం రామభద్రాపురం గ్రామానికి చెందిన మణికంఠరెడ్డి మరో 8 మందితో కలిసి రామతీర్థం రిజర్వాయర్‌లో ఆదివారం ఈత కోసం దిగిన సంగతి తెలిసిందే. రిజర్వాయర్‌లో పూడు మట్టి ఎక్కువగా ఉండటంతో మృతదేహం నీటి లోపల కూరుకుపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నాటికి మృతదేహం రిజర్వాయర్‌లో నీటిపైకి తేలుతుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మణికంఠ రెడ్డి తల్లిదండ్రులు, కటుంబసభ్యులు మృతదేహం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజర్వాయర్ వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎదురుచూశారు.

ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్‌కు పీడీ జీవన్



ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన పీడీ జీవన్

ఉలవపాడు: ప్రపంచ మాస్టర్ అథ్లెటిక్స్‌కు మండల పరిధిలోని రామాయపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. జూలైలో ఆస్ట్రేలియాలో జరిగే వరల్డ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 45 ఏళ్ల విభాగంలో ఆంధ్ర తరఫున పాల్గొని జావలిన్ త్రో, హామర్ త్రోలో బంగారుపతకాలు సాధించాడు.జీవన్ చాలామంది క్రీడాకారులను తయారుచేసి ఉత్తమ పీడీగా అవార్డు అందుకున్నారు. ప్రతిభ చూపిన పీడీ జీవన్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

వైభవంగా వన మహోత్సవం



వనమహోత్సవం పూజల్లో పాల్గొన్న భక్తులు



రావణదహనం నిర్వహిస్తున్న భక్తులు

- ఉత్సాహంగా రావణాసుర దహనం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేటలో కోదండరామస్వామి తిరానాళ్ల సందర్భంగా మూడో రోజు వనమహోత్సవం, రావణాసుర దహన కార్యక్రమం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం సీతారాముల శాంతి కల్యాణానంతరం స్వామివార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించిన భక్తులు స్వామిని వనంలో ఉంచారు. ఈసందర్భంగా సోమవారం వనంలో ఉన్న సీతా, రామ, లక్ష్మణ, హనుమంత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పొంగించి స్వామివార్లకు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులను భజంత్రీల మేళతాళాల నడుమ ఉత్సవంగా గ్రామంలోకి తీసుకువచ్చి రావణాసుర దహన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. మంగళవారం ఉదయం ఎడ్ల పోటీలు నిర్వహించనున్నారు.

గజవాహనంపై వేణుగోపాలుడు



గజ వాహనంపై దర్శనమిస్తున్న వేణుగోపాలస్వామి

యర్రగొండపాలెం: మిల్లంపల్లి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తిరునాళ్ల



గ్రామోత్సవంలో గంగమ్మతల్లి



ఆలయంలోని గంగమ్మ తల్లి మూల విరాట్

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాపురం గ్రామంలో పాలేటి గంగ వద్ద వెలసిన గంగమ్మ ఆలయ జాతర సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వలేదు. చివరి రోజు గంగమ్మకు ప్రత్యేక అలంకరణ, గ్రామోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా గంగమ్మను వెంగళాపురం, పెదఅలవలపాడు, గుదేవారిపాలెం గ్రామాల వీధుల్లో ఊరేగించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు యువత, మహిళలు భారీగా హాజరయ్యారు. అనంతరం ఉత్సవాల్లో తిప్పేందుకు బొల్లావులను తీసుకొచ్చి ముద్రలు వేయించుకున్నారు. అనంతరం బొల్లావులను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మృతుడు బింగినపల్లి వాసిగా గుర్తింపు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని సోమరాజుపల్లి రైల్వేగేటు వద్ద ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మృతిచెందిన వ్యక్తి బింగినపల్లి గ్రామ పంచాయతీ పెదబోయినపాలేనికి చెందిన కోమట్ల సుధాకరరెడ్డిగా గుర్తించినట్లు ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. పాత గొడవల నేపథ్యంలో మద్యం మత్తులో గ్రామంలోని ఉప్పు కొఠారుల వద్ద సుధాకర రెడ్డికి, గోపిరెడ్డికి మధ్య జరిగిన ఘర్షణలో మనస్తాపం చెందిన సుధాకరరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి ఒంగోలు జీజీహెచ్‌లో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి గ్రామానికి తరలించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. కేసును ఒంగోలు జీఆర్‌పీ పోలీసులు సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తారని, అప్పుడు పూర్తిస్థాయిలో విచారణ చేసి దోషులను శిక్షిస్తామని ఎస్సై చెప్పారు.